క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

హుజూర్‌నగర్ : రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ కోసం హుజూర్‌గనర్ పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘంసీఈఓ నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జెర్రిపోతులగూడెంలో గతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే సీపీఐ తరఫున పోరాడి కాపాడామని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ ఆ భూమిని కబ్జా చేస్తున్నారని కావున ఆ భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు, ఇళ్లు లేని నిరుపేదలకు ఆయన కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నాదానం చేస్తున్న నర్సింహారావు

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మారిశెట్టి నర్సింహారావు–నాగమణి దంపతుల మనువరాలు దాములూరి మహి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కోదాడలోని శనగల రాధాకృష్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను సంస్థ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, లక్ష్మీప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మూడు మీసేవా కేంద్రాలు మంజూరు

గరిడేపల్లి : మండల పరిధిలోని సర్వారం, రాయినిగూడెం, కల్మలచెరువు గ్రామాలకు మీసేవా కేంద్రాలు మంజూరైనట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తుదారులు మహిళా సంఘంలో సభ్యురాలై ఉండి ఇంటర్మీడియట్ పూర్తి చేసి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని తెలిపారు.

గోమాతకు పూజలు



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్రనామ కుంకుమార్చనను అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జీవితం స్ఫూర్తిదాయకం

సూర్యాపేట : హెలెన్ కెల్లర్ జీవితం వికలాంగుల సమాజానికి స్ఫూర్తి దాయకమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య అన్నారు. శుక్రవారం హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెలెన్ కెల్లర్ తన జీవితాంతం అంధులకు అండగా ఉన్నారని అన్నారు. అంధులను ఆదుకునేందుకు 34 దేశాలలో సేవ చేశారని తెలిపారు. హెలెన్ కెల్లర్‌కు చిన్న వయసులోనే రెండు కళ్లు పోయాయని, అయినా నిరుత్సాహ పడకుండా ఉన్నత చదువులు చదువుకున్నారని అన్నారు. వికలాంగులు హెలెన్ కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు శిరంశెట్టి రామారావు, ఉపాధ్యక్షుడు సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు కప్పల సత్యం, రామ్‌కుమార్, ఎస్ వనిత, అరుణ, ఉమా పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లు.. ట్రాఫిక్ కష్టాలు

- అనంతగిరి, ఎస్వీ కళాశాల రోడ్లలో నిత్యం వాహనాల రద్దీ
- నయానగర్‌వాసులకు నరకయాతన
- ప్రత్యామ్నాయ మార్గం చూపడంలో విఫలమవుతున్న అధికారులు



రద్దీగా ఉన్న అనంతగిరి రోడ్డు

కోదాడ : పట్టణంలోని నయానగర్ నుంచి ప్రధాన రహదారికి వెళ్లే అనంతగిరి రోడ్డు, ఎస్వీ కళాశాల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో నయానగర్‌వాసులు ప్రధాన రోడ్డు మీదకు రావడానికి నరకయాతన పడుతున్నారు. ఈ ప్రాంతంలోనే పలు కళాశాలలు, పాఠశాలలు ఉండడంతో పాటు ఈ రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. అయినా మున్సిపల్ అధికారులు, పాలకులు ప్రత్యమ్నాయ మార్గం చూపకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది.

ఉదయం, సాయంత్రం రద్దీగా..

నయానగర్‌కు వెళ్లే అనంతగిరి రోడ్డు నుంచే దాదాపు రెండు మండలాలకు 20 గ్రామాల ప్రజలతో పాటు రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 40 బస్సులు వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఈ బస్సులన్నీ ఒకే సమయంలో వస్తుండడంతో ఆయా రోడ్లు రద్దీగా మారుతున్నాయి. దీంతో పాటు ఈ రోడ్డులో ఉన్న దుకాణాలకు పార్కింగ్ వసతి లేకపోవడంతో వ్యాపార నిమిత్తం వచ్చే వారి వాహనాలు కూడా రోడ్డుపై నిలుపుతుండడంతో రాకపోకలకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

రోడ్డుపైనే బ్యాంకు వాహనాలు..

నయానగర్‌కు వెళ్లడానికి అనంతగిరి రోడ్డుకు సమాంతరంగా ఉన్న ఎస్వీ కళాశాల రోడ్డులో గత సంవత్సరం ఓ జాతీయ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆ బ్యాంక్‌కు పార్కింగ్ వసతి లేకపోవడంతో బ్యాంకు పనిమీద వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి బ్యాంకులోకి వెళ్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బ్యాంక్‌కు సెల్లార్ ఉన్నా అందులో పార్కింగ్ చేయడానికి, చేయించడానికి బ్యాంక్ అధికారులు గార్డును ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఈ బ్యాంక్ అధికారులతో మాట్లాడి బ్యాంక్ సెల్లార్‌లో వాహనాలు పార్కింగ్ చేసేవిధంగా చూడాలని కోరుతున్నారు.

రెండు ప్రత్యామ్నాయ మార్గాలున్నా..

నయానగర్‌వాసులు ప్రధాన రహదారిపైకి వెళ్లడానికి రెండు ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్వీ కళాశాలకు తూర్పు వైపున ఉన్న రోడ్డుకు 10 అడుగుల మేర ఒక భవనం అడ్డుగా ఉంది. భవన యజమానితో మాట్లాడి అతనికి తగిన పరిహారం ఇచ్చి రోడ్డును ఉపయోగంలోకి తీసుకువస్తే సగం సమస్య తీరుతుంది. దీంతో పాటు ఎస్ఎస్‌పీ క్యాంపు నుంచి నయానగర్‌కు వైపు 30 అడుగుల సీసీ రోడ్డు వేశారు. కానీ నయానగర్‌కు వెళ్లడానికి, సీసీ రోడ్డుకు మధ్య ఒక ప్రైవేటు వ్యక్తి ప్లాటు అడ్డుగా ఉంది. ఇది కూడా కేవలం 30 అడుగులు మాత్రమే. సదరు వ్యక్తితో మాట్లాడి పరిహారం ఇచ్చి ఈ రోడ్డును నయానగర్ ప్రధాన వీధికి కలిపితే ట్రాఫిక్ సమస్య నుంచి నయానగర్ వాసులు బయటపడే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు, అధికారులు ఆలోచించి సమస్య పరిష్కారం చేయాలని నయానగర్‌వాసులు కోరుతున్నారు.

సమస్యపై అధికారులు, పాలకులకు చిత్తశుద్ధి ఉండాలి



అనంతగిరి రోడ్డు, ఎస్వీ కళాశాల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎస్వీ కళాశాల తూర్పు వైపు రోడ్డు, ఎస్ఎస్‌పీ క్యాంపు నుంచి నయానగర్ రోడ్డు చివర్లలో ఉన్న భవనం, స్థలాల వ్యక్తులతో మాట్లాడి ప్రధాన రోడ్డు నుంచి నయానగర్‌కు కలిపితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పాలకులు, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే సమస్య పరిష్కారం అవుతుంది.

– ఈదుల కృష్ణయ్య, న్యాయవాది

వైభవంగా నరసింహ సుదర్శన యాగం



సుదర్శన యాగంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కూచిపూడిలో గల భక్త రామాంజనేయ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడు నల్లందీగల్ లక్ష్మీనర్సింహాచార్యుల చేత నరసింహ సుదర్శన యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ, హనుమాన్ జీవిత చరిత్రతో పాటు స్థానికంగా వెలసిన నారసింహస్వామి లీలను భక్తులను వివరించారు. కూచిపూడిలో నూతనంగా నిర్మిస్తున్న భక్తరామాంజనేయస్వామి ఆలయం భవిష్యత్తులో దేదీప్యమానంగా విరాజిల్లుతుందని లక్ష్మీనర్సింహచార్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో వేదపడింతులు వంగిపురం పవన్‌కుమార్‌చార్యులు, నిర్వాహకులు కందికొండ సాయిబాబ, ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మందలపు కృష్ణ కుమారిశేషు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

మోతె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు అన్నారు. శుక్రవారం మోతె మండల పరిధిలో రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామ పంచాయతీలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీఐటీయూ మోతె మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు గత 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జులై 10న దేశ వ్యాప్తంగా నిర్వహించబోయే నిరసన కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కాగా, రాఘవాపురం ఎక్స్‌రోడ్డు గ్రామ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండాను ఆ యూనియన్ నాయకుడు గుంటగాని ఏసు ఆవిష్కరించారు. భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ముల్కూర్ గోపాల్‌రెడ్డి, నాయకులు కిన్నెర పోతయ్య, దోసపాటి శ్రీను, చిట్యాల రవిచంద్ర, సామ సంజీవరెడ్డి, మల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్‌మెంట్ తర్వాత ప్రశాంతంగా గడపాలి



రిటైర్డు ఉద్యోగుల జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల, తదితరులు

కోదాడరూరల్ : రిటైర్డ్‌మెంట్ తర్వాత ప్రశాంతవంతమైన జీవితాన్ని గడపుతూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జూన్ నెలలో జరుపుకునే పలువురి రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కేక్ కట్ చేయించి మాట్లాడారు. ఆనందంగా గడిపేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. వృద్ధాప్యంలో మానసిక సమస్యలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు, యువత సన్మార్గంలో నడిచేందుకు రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పుట్టిన జరుపుకుంటున్న వారిని శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, రిటైర్డ్ ఉద్యోగుల కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, బొల్లు రాంబాబు, వెంకటేశ్వరరావు, విద్యాసాగర్, నరసయ్య తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



రాయినిగూడెంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని పారబోస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

గరిడేపల్లి : ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వీపీపీ ప్లాంటేషన్‌కి స్థలాలు ఎంపిక చేసుకోవాలన్నారు. అంటువ్యాధుల నివారణకు యాక్షన్‌ప్లాన్ రూపొందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 9గంటల మధ్యలో డీఎస్ఆర్ పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శి సుదీర్, ఏఎన్ఎం, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

1న ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

గరిడేపల్లి : ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జూలై 1న ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు కోరారు. శుక్రవారం గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో ఆ పథకానికి నిధుల కోత విధిస్తుందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు గ్రహించాలన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, కూలీలకు ఆటోచార్జీలు చెల్లించాలనే డిమాండ్‌తో నిర్వహించబోయే ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



వరదాపురంలో మాట్లాడుతున్న సయ్యద్‌రసీమియా

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రస్‌మియా డిమాండ్ చేశారు. శుక్రవారం మఠంపల్లి మండలంలోని వరదాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో వరదాపురం, చెన్నాయిపాలెం, తుమ్మలతండా, మంచ్యాతండాలకు చెందిన పంచాయతీ కార్మికుల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామ్లానాయక్, కార్యదర్శిగా బత్తుల వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా యేసయ్య, సభ్యులుగా స్వామి, బాలా సాబ్, గురుమూర్తి, బొందయ్య, ఈశ్వర్, రంగా, సతీష్, తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చింతలచెరువు వెంకటయ్య, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల యజమానులు, హమాలీల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో బజార్ హమాలీ సంఘం (టీఆర్ఎస్ కేవీ అనుబంధ సంఘం) నాయకులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి చార్జీల గడువు ముగిసినందున నూతన ఒప్పందం చేసుకోవాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన యాజమాన్యం కొంత సమయం కావాలని కోరడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు శంకర్, గణేష్, జగన్, టీఆర్ఎస్ కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, నాయకులు ఎం.శ్రీను, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సభ్యులు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేత



సైదులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు యలక సైదులుగౌడ్ కుటుంబానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దంపతులు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు సదరు మొత్తాన్ని సైదులు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, పీసీసీ ప్రతినిధి చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగవీటి రామారావు, నాయకులు కందుల కోటేశ్వరరావు, వెంకటనారాయణ, కుటుంబసభ్యులు ఉన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు అబ్దుల్ గఫూర్ మృతి



గఫూర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు షేక్.అబ్దుల్ గఫూర్ (70) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండారు నాగేశ్వరరావు, ఎండీ.ఖలీల్ అహ్మద్, దున్నా అంజయ్య, లావూరి బాలాజీ, అప్పిరెడ్డి, విశ్వనాథం, రసూల్, రామయ్య, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బరాఖత్‌గూడెంలో రక్షణ కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



ఎల్ఐసీ ఏజెంట్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో జాతీయ బీమా అవగాహన దినోత్సవాన్ని శుక్రవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎల్ఐసీ ఏజెంట్లను వారు సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు మాట్లాడారు. ప్రతి వ్యక్తి బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, మాజీ అధ్యక్షుడు సుంకర క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు గుండా సత్యానారాయణ, గుండ్రెడ్డి సైదిరెడ్డి, సురేష్, విశ్వనాథ్, మాతంగి సైదులు తదితరులు ఉన్నారు.

నాగరాజు మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



నాగరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తుమ్మల నాగేంద్రకుమార్ (నాగరాజు) మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. మునగాల మండలంలోని మాధవరం శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దుర్మరణం పాలైన నాగరాజు మృతదేహానికి తిమ్మారెడ్డిగూడెంలో వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఉప్పల జానకిరెడ్డి, నాయకులు వీరరాఘవరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, గుంజ రామకృష్ణ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిగిలిన స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను భర్తీ చేయాలి

గరిడేపల్లి : ఉపాధ్యాయుల పదోన్నతి కౌన్సిలింగ్‌లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను అర్హులైన ఎస్జీటీలతో వెంటనే భర్తీ చేసి, ఆ తర్వాత ఎస్జీటీల బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టులకు ఒకేసారి పదోన్నతుల వెబ్ ఆప్షన్స్ ఇవ్వడంతో ఒకే వ్యక్తి రెండు, మూడు పోస్టులకు ప్రమోషన్లు పొందారని, వారంతా ఏదో ఒక పోస్టు ఎంచుకొని విధుల్లో చేరిపోయారని తెలిపారు. దీంతో స్కూల్ అసిస్టెంట్ స్థాయి పోస్టులు మిగిలిపోయాయన్నారు. భాషా పండితులందరూ అప్‌గ్రేడ్ అయినందున తెలుగు, హిందీ ఉపాధ్యాయుల పోస్టులను కామన్ సీనియారిటీ ప్రకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తూరి భిక్షం, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసినవారిపై అవినీతి ఆరోపణలు తగవు

సూర్యాపేటటౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన వారిపై కాంగ్రెస్ నాయకులు అవినీతి మరకలు వేసే ప్రయత్నం చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, కౌన్సిలర్లు చింతలపాటి భరత్‌మహాజన్, తాహేర్‌పాష అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.80కోట్ల నిధులు పనులు ప్రారంభమైన తర్వాత వెనక్కి వెళ్లాయన్నారు. వెనక్కి వెళ్లిన నిధుల గురించి మాట్లాడమంటే వచ్చిన రూ.3కోట్ల 35లక్షల నిధుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూరబాల సైదులుగౌడ్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జాని, సాగర్ రెడ్డి, అనిల్‌రెడ్డి, జానకిరాం, వెంకన్న పాల్గొన్నారు.

అనుమతి లేని భవనం కూల్చివేత

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో అమ్మ గార్డెన్ ఎదురుగా పడిదల శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తి అనుమతి లేకుండా జీప్లస్1 భవనాన్ని నిర్మించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆ యజమానికి మే 18న, మే 23న, మే 29న నోటీసులు ఇచ్చామని చెప్పారు. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా నిర్మాణంలో ఉన్న భవనానికి సదరు వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం భవనాన్ని కూల్చివేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టొద్దని పట్టణ ప్రజలకు సూచించారు.

గత ప్రభుత్వంలో జీఓ 26 దుర్వినియోగం



మాట్లాడుతున్న కక్కిరేణి శ్రీనివాస్

భానుపురి : గత ప్రభుత్వ హయాంలో జీఓ 26ను దుర్వినియోగం చేసి బిల్లులు పొందారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీఓ 26ను దుర్వినియోగం చేసి ప్రతి బిల్లును కలెక్టర్ ద్వారా ఆమోదింపజేశారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఈ బిల్లులను వాడారని అన్నారు. ఐటీ హబ్‌కు బీటీ రోడ్డు పేరుతో రూ.41 లక్షలు డ్రాచేశారని, ప్రైవేటు వ్యక్తి భవనానికి బీటీ రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల వార్డులకే ఎక్కువ నిధులు మంజూరు చేశారని, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఉన్నచోట అభివృద్ధి చేయలేదన్నారు. మున్సిపల్ చైర్మన్ అధికారులను ఇంటికి పిలిపించి కౌన్సిల్ ఎజెండా తయారు చేశారని, కనీసం ఫ్లోర్ లీడర్లతో చర్చించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, బచ్చలకూరి శ్రీనివాస్, ధరావత్ రవికుమార్, నాయకులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

మఠంపల్లి : మండలంలోని జామ్లాతండాకు చెందిన భూక్యా కృష్ణ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్ రూ.2 లక్షల బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కమల, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

అర్వపల్లి : ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్యమిత్రలకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ చత్రునాయక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఆరోగ్యమిత్రలు పేరూరి రమణ, వేణు, మధుసూదన్, బద్రు, కృష్ణకుమార్, గఫార్ పాల్గొన్నారు.